సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

చురుగ్గా ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న సిబ్బంది

అల్లిపురం : ఓటర్ జాబితా పరిశీలన ప్రక్రియ 33వ వార్డులో శనివారం చురుగ్గా కొనసాగింది. ఎంజీఎం హై స్కూల్లో జరిగిన కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీలు కృష్ణకుమారి, చందు, ఎమినిటీ సెక్రటరీలు రమ్య, సాహిద్ పాల్గొని ఓటర్ జాబితాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, కొడమంచిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నూరు శాతం వ్యాధి నిరోధక టీకాలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం కోసం ప్రణాళికలు రూపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బాపూజీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) శనివారం ఆయన సందర్శించారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు నూరు శాతం అయ్యేలా చూడాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఇతర ప్రాంతాల సందర్శనకు వెళ్లిన సమయంలో మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. బర్త్ ప్లానింగ్, హై రిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యుల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి గర్భిణికి టీటీ ఇంజెక్షన్ ఇవ్వాలని, 12 వారాల లోపు ప్రతి గర్భిణి పేరు నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోలీ క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



చర్చిలో కేక్ కట్ చేస్తున్న జాన్‌వెస్లీ

జగదాంబ : ఏసుక్రీస్తు శాంతి సందేశం ఇచ్చారని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. శనివారం జీవీఎంసీ 39వ వార్డు పాతపోస్టాఫీసు దరి హోలీక్రైస్ట్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చర్చి బిషఫ్ బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులకు వేతనాలు ఇచ్చిన నేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. క్రైస్తవుల కోసం నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ. నాలుగు వందల కోట్లు ఖర్చు చేసిందన్నారు. క్రైస్తవులందరూ జగనన్న సేవలను గుర్తించి ఆయనకు మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో కనెక్ట్ పోటీలు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం 'కనెక్ట్-2023' పోటీలు నిర్వహించారు. ప్రపంచ కంప్యూటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు డిగ్రీ కళాశాలల విద్యార్థినులకు కోడ్ స్పార్క్, హగ్ ది బగ్, ఐకాన్ ఐక్యూ, టెక్ క్విజ్, కీబోర్డ్ బిల్డింగ్, ఐడియా ఫ్యాక్టరీ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.శిరీష, జి.దీప్తి, ఎస్.మాధురి, జె.అనిత, కుంకుం ధారా, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



నాడు..

విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల.. ఈ పేరు వింటే ఘన చరిత్ర కళ్ల ముందు కదలాడుతుంది. ఎందరో విద్యార్థినులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన సరస్వతీ నిలయం. అంతటి కీర్తి గల కళాశాల దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక.. బాలికలకు సరైన సదుపాయాలు లేక విలవిల్లాడేది. విద్యార్థినులు అనేక కష్టాలు ఎదుర్కొనేవారు. గత ప్రభుత్వం కళాశాల అభివృద్ధిని పట్టించుకోలేదు. అధునాతన, సాంకేతిక విద్య మాట అటుంచితే.. సాధారణ స్థాయిలో కూడా విద్యార్థినులకు విద్యనందించే సామర్థ్యం లేకుండా ఉండేది.

నేడు..

కళ తప్పిన కళాశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవం పోసింది. నాడు-నేడు ఫేజ్-2లో ప్రభుత్వ బాలికల కళాశాలకు రూ.1.42 కోట్లు విడుదల చేసింది. కళాశాలలో ప్రాథమిక సదుపాయాల కల్పనకు ఆ నిధులు కేటాయించింది. ప్రస్తుతం ఆయా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు వసతులు సమకూరడంతో విద్యార్థులు హాయిగా చదువుకుంటున్నారు. పనులు పూర్తయితే ప్రభుత్వ బాలికల కళాశాల కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మారనుందని విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

కళాశాలకు కొత్తకళ



విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల



విశాఖ ప్రభుత్వ జూనియర్ బాలికల కాలేజీకి కొత్త రూపు

రూ.కోటీ 42 లక్షలతో అభివృద్ధి పనులు

విద్యార్థినుల హర్షాతిరేకాలు



విశాలమైన తరగతి గదులు.. గ్రానైట్ గచ్చులతో..


దాబాగార్డెన్స్: ఎందరో నిరుపేద విద్యార్థినులకు వెలుగుదీపం.. వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన కళాశాల.. విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల. 1975 నుంచి విద్యా రంగంలో తనవంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగిపోతోంది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థినులను సమున్నతంగా తీర్చిదిద్దుతున్న విజ్ఞాన భాండాగారం. అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ మున్ముందుకు దూసుకుపోతోంది. విశాలమైన తరగతి గదులు, ఉన్నత ప్రమాణాలు కలిగిన బోధనా సిబ్బంది, ప్రయోగశాలలు, భౌతిక వనరులు కలిగి ఉంది.

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఏదీ?

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కళాశాలను అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో చూపలేదు. ఎన్నోసార్లు కళాశాలలో కార్యక్రమాలకు హాజరైన ప్రజా ప్రతినిధులు ఇక్కడి పరిస్థితిని నేరుగా చూసినా కళాశాలలో సౌకర్యాల కల్పనకు ఆసక్తి చూపలేదు. అప్పట్లో కనీస సదుపాయాలేక బాలికలు అవస్థలు పడేవారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన చేపట్టారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నాడు-నేడు కింద నిధులు విడుదల చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారు. ఈ క్రమంలో విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల పరిస్థితిని ప్రభుత్వం గుర్తించింది. దీంతో నాడు-నేడు ఫేజ్-2లో జూనియర్ కళాశాలలో వసతుల కల్పనకు రూ.1.42 కోట్ల నిధులు విడుదల చేసింది. ఆయా నిధులను పలు రకాల సౌకర్యాలకు కేటాయింపు చేశారు.



పిల్లలు నేర్చుకోవడానికి చక్కటి గ్రీన్‌చాక్ బోర్డు

సమకూరనున్న వసతులు..

- కళాశాలలోని అన్ని తరగతి గదుల్లో గ్రీన్ చాక్‌బోర్డులు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే కళాశాలలో పలు తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు.
- రూ.35.4 లక్షలతో ఫ్లోర్‌కి 11కి చొప్పున మూడు అంతస్తుల్లో 33 అధునాతన టాయ్‌లెట్లు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు పనులు పూర్తి కావచ్చాయి.
- రూ.21.69 లక్షలతో మైనర్, మేజర్ పనులు పూర్తయ్యాయి.
- రూ.3.6 లక్షలతో ఎలక్ట్రికల్ పనులు చేపట్టారు.
- రూ.14.15 లక్షలతో డ్రింకింగ్ వాటర్ కోసం నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.5 లక్షల 11 వేల 489 విలువైన పనులు పూర్తయ్యాయి.
- రూ.లక్షా 5 వేల 626తో ఫర్నిచర్ ఏర్పాటు చేశారు.



నిర్మాణంలో ఉన్న అధునాతన టాయ్‌లెట్లు

కళాశాలలో అభివృద్ధి ఇలా..

- రూ. 4.80 లక్షలతో తరగతి గదుల్లో గ్రీన్ చాక్‌బోర్డుల ఏర్పాటు.
- రూ.35.4 లక్షలతో 33 అధునాతన టాయ్‌లెట్ల ఏర్పాటు.
- రూ.21.69 లక్షలతో పూర్తయిన మైనర్, మేజర్ పనులు.
- రూ.3.6 లక్షలతో ఎలక్ట్రికల్ పనులు.
- రూ.14.15 లక్షలతో డ్రింకింగ్ వాటర్.
- రూ.లక్షా 5 వేల 626తో ఫర్నిచర్ ఏర్పాటు.
- రూ.2 లక్షల పైచిలుకు మొత్తంతో పెయింటింగ్ పనులు.

- తరగతి గదిలో గ్రీన్‌చాక్ బోర్డుల కోసం ప్రభుత్వం రూ.4 లక్షల 80 వేల 606 నిధులు మంజూరు చేయగా, ఇప్పటి వరకు రూ.2 లక్షల 64 వేల 280తో పలు తరగతి గదుల్లో గ్రీన్‌చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు.
- కళాశాల పెయింటింగ్ కోసం రూ.2 లక్షల 56 వేల 211 మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేయగా, ప్రస్తుతం పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. మొత్తంగా రూ.కోటీ 42 లక్షల 26 వేల 555 నిధులు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.59 లక్షల 47 వేల 802 మొత్తానికి పనులు పూర్తయ్యాయి.

ప్రైవేట్.. కార్పొరేట్‌కు దీటుగా..



కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రూపుదిద్దుకుంటోంది. కళాశాల రూపురేఖలు మారాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం. ప్రస్తుతం కళాశాలకు విద్యార్థులు క్యూ కడుతున్నారు.

– జనపల్లి విజయ, ప్రిన్సిపాల్, విశాఖ బాలికల కళాశాల

మారుతున్న రూపురేఖలు..



నాడు-నేడు పథకంలో మా కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. గతంలో కన్నా ఇప్పుడు మా కళాశాల రూపురేఖలు మారిపోయాయి. అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, కొత్తబోర్డులు ఏర్పాటు అయ్యాయి. సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. అధ్యాపకుల టీచింగ్ బాగుంది.

– సీహెచ్ జ్యోత్స్న, ఇంటర్ సెకండియర్

మంచి టీచింగ్.. మా మంచి కళాశాల



పేద విద్యార్థులకు ఈ కళాశాల ఓ వరం వంటిది. ఇక్కడ మంచి టీచింగ్‌తో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. మాలాంటి పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయపడుతున్నందుకు కృతజ్ఞతలు. మంచి విద్యనందిస్తున్న అధ్యాపకులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– ఎం. మహిత, సెకండియర్ విద్యార్థిని

చాలా రిలీఫ్‌గా ఉంది..



మా కళాశాలలో గతంలో ఏ సౌకర్యం కరెక్ట్‌గా ఉండేది కాదు. మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉండేది. ఇప్పుడు ఆ ఇబ్బందులు లేవు. తరగతి గదిలో గ్రీన్‌చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. పలు రకాలుగా కళాశాలను అభివృదిద్ధ చేశారు. చదువుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– డి. హెప్సిబా, సెకండియర్ విద్యార్థిని

ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు..



చదువుకోవడానికి ఉచితంగా విద్యనందిస్తున్నారు. చదువుకుంటున్నందుకు విద్యాదీవెన వంటి సౌకర్యం కల్పిస్తున్నారు. మాలాంటి పేద పిల్లలకు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో చదివే స్తోమత లేదు. ఈ ప్రభుత్వం దయ వల్ల ఉచితంగానే విద్యనభ్యసిస్తున్నాం. ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– వి.ఇ.లక్ష్మి, సెకండియర్ విద్యార్థిని

సంక్షేమ సారథి సీఎం జగన్



మౌలాలీపంజా వద్ద ప్రజలకు బుక్‌లెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : సంక్షేమ సారథి సీఎం జగనన్న అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శనివారం జీవీఎంసీ 39వ వార్డు మౌలాలీపంజా సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ముందుగా ఎమ్మెల్యే జెండా ఎగరేసి, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. నాలుగేళ్ల పాలనలో ఒక్క మౌలాలీపంజా సచివాలయం పరిధిలోనే రూ. 15 కోట్ల 14 లక్షల లబ్ధిని అర్హులకు అందజేశారన్నారు. ప్రతి పేదవాడు సంక్షేమ పథకాలు పొందుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, క్లస్టర్-3 ఇన్‌చార్జి సనపల రవీంద్ర భరత్, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, సీనియర్ నాయకులు బాల్జి, సలీం, సీమేన్ శ్రీను, అనిల్, ఆది, రాజేష్, విజయ్, రమణమ్మ, కన్వీనర్లు, గృహసారథులు, జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



37వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జానకీరామ్, వాసు

జగన్ మళ్లీ సీఎం కావాలి..

అల్లిపురం : రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అన్నారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న అసలైన అభివృద్ధిని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. శనివారం మధ్యాహ్నం 33వ వార్డులో సచివాలయం ఇన్‌చార్జి, కన్వీనర్ కొడమంచిలి శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. వై నాట్ 175 నినాదాన్ని నిజం చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. అనంతరం పెద్దలు, వృద్ధులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు రంధి గోపీకృష్ణ, కన్వీనర్లు బొడ్డేటి ప్రసాద్, లక్ష్మీకాంతం, ఎల్లంకి చిన్నమ్మలు, పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, పచ్చిరిపల్లి రాము, కణితి బ్రహ్మం, మాదాబత్తుల రమేష్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కర్రి నీలకంఠం, ఇతర నాయకులు

37వ వార్డులో..

దాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం శనివారం 37వ వార్డు గొల్లవీధి సచివాలయం పరిధిలో నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, మండల అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్ విజయం సాధించడం తథ్యమన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు రెయ్యి డేవిడ్‌రాజు, వెంకటలక్ష్మి, నిమ్మకాయల ఆదిలక్ష్మి, రోజా, రామరాజు, రామచంద్ర, చొక్కాకుల ఆనంద్, డాక్టర్ రమణ, నల్లి వంశీ, గిరజాల ఉమా మహేశ్వరరావు, కోరాడ సురేష్, వార్డు ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు చక్కటి స్పందన



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం ఆశీల్‌మెట్టలో గల కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మంచి స్పందన వచ్చింది. వివిధ సైక్లోన్స్ కారణంగా పూర్తిగా మునిగిపోయిన ఫిషింగ్ బోట్స్‌కు నష్టపరిహారం చెల్లించాలని ఫిషింగ్ హార్బర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడారు. 36వ వార్డు సున్నపువీధిలో నివసిస్తున్న 14 మంది ముస్లిం కుటుంబ సభ్యులకు ఒకే విద్యుత్ మీటర్ ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ఎమ్మెల్యే ఏపీఈపీడీసీఎల్ ఈఈతో మాట్లాడి సమస్య పరిష్కారానికి మార్గం చూపారు. పార్టీ కార్యకర్తలకు హుద్‌హుద్ హౌసెస్ పట్టాలు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులతో మాట్లాడారు. తన (ఎమ్మెల్యే) కళాశాలలో చదువుతున్న కార్యకర్తల పిల్లలకు ఫీజు రాయితీ కోరగా, వెంటనే ఫీజు కన్సెషన్ కల్పించారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం

దాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో మెడికల్ సాయం కోసం వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించారు. తన సొంత నిధుల నుంచి పది మందికి రూ.50 వేలు అందజేశారు. వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అందజేసి భరోసా కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రెసిడెంట్లు, ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.



కోన రామారావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తి చేయండి

దాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండగల సీజన్ కనుక నగర ప్రజలకు, వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చాలా కాలంగా పూర్ణామార్కెట్ రోడ్డు విస్తరణకు నోచుకోక వ్యాపారులు, వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. విస్తరణ పనుల్లో అడ్డంకులు, ఆటంకాలు ఏమైనా ఉన్నాయా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నప్పుడు ప్రజలకు, వ్యాపారులకు కొన్ని ఇబ్బందులు కలుగుతున్నప్పటికీ నగరాభివృద్ధిలో భాగంగా సహకరించాలని నగర ప్రజలకు మేయర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పూర్ణామార్కెట్ రోడ్డు విస్తరించనుండడంతో స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారి సురేష్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజు, ఏసీపీ వినయ్‌ప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషి, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులను ఆదేశిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

మునిగిపోయిన బోట్ల వెలికితీతకు డిమాండ్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో ఇటీవల మునిగిపోయిన బోట్లను బయటకు తీయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు డిమాండ్ చేశారు. శనివారం హార్బర్‌లో బోట్లు దగ్ధమైన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయం తాను పోర్టు చైర్మన్‌తో మాట్లాడి సమస్య పరిష్కారిస్తానన్నారు. మత్స్య సంపద యోజన పథకం కింద అవసరమైన వారికి రుణాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్, రాష్ట్ర కార్యదర్శి సుహాసిని ఆనంద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షురాలు థోని నాగరాజు, కార్యదర్శి కొండ ప్రసాద్, డాల్ఫిన్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీర్రాజు, మర పడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తదితరులు పాల్గన్నారు.

పాలసీదారులను కాపాడుకోవాలి

దాబాగార్డెన్స్ : ఎల్ఐసీపై నమ్మకంతో పెట్టుబడి పెట్టిన పాలసీదారులను కాపాడుకోవడం మన ముఖ్య కర్తవ్యమని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సతీష్ తెలిపారు. యూనియన్ 49వ సర్వసభ్య సమావేశం శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యూనియన్ అధ్యక్షురాలు కామేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే బీమా రంగాన్ని పూర్తిగా నాశనం చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడడానికి కార్మికుల హక్కులు పణంగా పెడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోదండరామ్, బి. హరనాథ్, రవికుమార్, మోహన్‌రావు, కృష్ణమూర్తి, ఎ. రామకృష్ణ, తిరుమలరావు, నాగరాజు, టాగూర్, భగవాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా .. ఉత్సాహంగా



నృత్యం చేస్తున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్ : శ్రీకాశ్యప్ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో భాగంగా సీనియర్ విద్యార్థులు చేసిన వినోద, సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల విద్యార్థినులు అనూష, స్రవంతి వేడుకలు ఆరంభించగా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ టీఆర్ఎస్ వర్మ, డైరెక్టర్ నారాయణమూర్తి, ప్రెసిడెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎల్. జ్యోత్స్నరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కరస్పాండెంట్ వర్మ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దే ఫ్యాకల్టీ ఉందన్నారు. ప్రిన్సిపాల్ నారాయణమూర్తి మాట్లాడుతూ కళాశాల క్రీడలకు మద్దతు ఇస్తుందన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నాటకాలు, జానపద నృత్యాలు అలరించాయి.



